క్లుప్తంగా

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



తాడిమర్రిలో జేసీబీతో భవనాలను తొలగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా.. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి దగ్గర ఉండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇళ్లను తొలగించుకునేందుకు ప్రజలు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. రెండు ఇటాచీలతో ఇళ్లకు పడగొడుతున్నారు. రెండు జేసీబీలతో వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలించారు. రోడ్డు విస్తరణతో తాడిమర్రిలో ప్రధాన రహదారి విశాలంగా కనిపిస్తోంది. వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాడిమర్రి, పట్నం ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, శరత్‌చంద్ర సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న సర్పంచ్ రామాంజులురెడ్డి

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గొకనపల్లి గ్రామానికి చెందిన మంగలి అప్పయ్య (46) కొన్ని సంవత్సరాలుగా నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయాన్ని సర్పంచ్ రామాంజులురెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేయించారు. మృతుడి భార్యకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

పుట్టపర్తి టౌన్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని పాస్టర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై జరిగిన సంఘటనలు దేశానికే మాయని మచ్చ అన్నారు. కొంత మంది మతోన్మాదులు క్రైస్తవ మహిళలను అవమానించడం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి అక్కడ శాంతిని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు విశ్వాస్, కార్యదర్శి దానియేల్, నియోజకవర్గ అధ్యక్షుడు జోసెఫ్, జిల్లాల పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు 'నా భూమి-నా దేశం'

బత్తలపల్లి: మండలంలోని గరిశలపల్లి, తంబాపురం, పోట్లమర్రి పంచాయతీల్లో సోమవారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు పంచాయతీల్లో మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



సర్టిఫికెట్లు, బెల్టులు చూపుతున్న విద్యార్థులు

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీస్టార్ ఆల్ ఇండియా బుడోకాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ ఇనయత్‌బాషా ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పల్, బ్రౌన్ బెల్టులు అందజేశారు. అలాగే సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. చదువుతో పాటు కరాటేలో కూడా మెలకువలు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటుందని కరాటే మాస్టర్ తెలిపారు.



గాండ్లపెంట: పీర్ల ఊరేగింపు



నల్లమాడ: దొన్నికోటలో పీర్లను అగ్నిగుండం ప్రవేశానికి తీసుకెళ్తున్న దృశ్యం



బత్తలపల్లి: జ్వాలాపురంలో పీర్లను జలధికి తరలిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జలధి

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో జలధి వేడుకలను జరుపుకున్నారు. తొలుత పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి మకానాల్లో కొలువుదీర్చారు. ఉదయాన్నే పీర్ల గుండం వద్ద పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు. భక్తులు చక్కెర, బెల్లం చదివింపులు చేయించి, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు తెల్లవారుజామును పీర్లతో యువకులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. బంధువులు, స్నేహితుల రాకతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం అగ్నిగుండం చుట్టూ యువకులు అలావ్ ఆడుతూ సందడి చేశారు. అనంతరం ముజావర్లు పీర్ల స్వాములను జలధికి తరలించారు. విషాద గీతాలాపనతో తిరిగి పీర్లను ఒక మూటగా తీసుకొచ్చి మకాన్‌లకు చేర్చారు.

– సాక్షినెట్‌వర్క్:



బత్తలపల్లి: తంబాపురంలో భక్తజన సందోహం



పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో పీర్ల దర్శనానికి వచ్చిన భక్తులు



ముక్తాపురంలో జలధికి తరలుతున్న పీర్ల స్వాములు



ధర్మవరం రూరల్: పోతుకుంట కొత్త కాలనీలో..



ధర్మవరం అర్బన్: జలధికి తరలుతున్న గూడ్స్ షెడ్ కొట్టాల పీర్లు



పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పీర్లు



బత్తలపల్లి: నల్లబోయనపల్లిలో యువత సందడి



పుట్టపర్తి టౌన్: బీడుపల్లి గ్రామంలో..



పుట్టపర్తి అర్బన్: అలావ్ తొక్కుతున్న యువకులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

పుట్టపర్తి టౌన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గణేష్ కూడలి నుంచి సాయి ఆరామం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సాయి ఆరామంలో సత్యసాయి జిల్లా రజక సంఘం తొలి మహాసభ నిర్వహించారు. అనంతరం పన్నీటి కాశయ్య మాట్లాడుతూ.. దేశంలో అనేక రాష్ట్రాల్లో రజకులను ఎస్సీ, ఎస్టీలుగా పరిగణిస్తున్నారన్నారు. ఏపీలో కూడా షెడ్యూల్డ్ కులాల్లో చేర్చాలని పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. షెడ్యూల్డ్ కులాల్లోకి చేర్చితే దాడులు, బహిష్కరణలు ఉండవన్నారు. అంతేకాక రజకులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. రజకులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లో సంఘాలు బలోపేతం చేయడమే లక్ష్యంగా మహాసభలు నిర్వహిస్తామన్నారు. షెడ్యూల్డ్ కులాల్లోకి చేర్చడమే అంతిమ లక్ష్యమని వెల్లడించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, రాష్ట్ర కార్యదర్శి తెలిక ఆంజనేయులు మాట్లాడుతూ.. రజకుల కోసం నిర్మించిన దోభీఘాట్లు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. రజకులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపనిపల్లి శివప్ప, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కోగిర సువర్ణ, నాయకులు ఎర్రిస్వామి, ప్రొద్దుటూరు వెంకటేషు, రామచంద్ర, నారాయణప్ప, కనుముక్కల లక్ష్మన్న పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న రజక సంఘం నాయకులు

పుట్టపర్తిని మరింత అభివృద్ధి చేద్దాం



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిని మరింత అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా తీసుకొచ్చారన్నారు. చుట్టుప్రక్కల గ్రామాలు కలుపుతూ నేషనల్ హైవే కూడా తీసుకొచ్చిన విషయాన్నిగుర్తు చేశారు. ఈ హైవేతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థకు కూడా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పుట్టపర్తిని నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీ స్థాయికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. పుట్టపర్తి అభివృద్ధిలో భాగంగా 15 ఫైనాన్స్ కింద రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు రూ.కోటి కేటాయిస్తామన్నారు. వెస్ట్ గేట్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ, సత్యసాయి వాటర్ పంప్‌హౌస్ నుంచి బీడుపల్లి వరకూ బీటీ రోడ్డుకు రూ.కోటి వెచ్చిస్తామని పేర్కొన్నారు. అలాగే 20 వార్డుల్లో తాగునీరు, లైటింగ్ ఇతర మౌలిక సదుపాయాలకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మన పార్టీ, మన మీద ఎంతో నమ్మకంతో ప్రజలు మనకు ఓట్లు వేసి గెలిపించి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అధికారులతో కలసి వార్డుల్లో పర్యటించి సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మున్సిపల్ విప్ సాయి గీత, అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

కనగానపల్లి: రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ నరేష్‌చౌదరిపై చర్యలు తీసుకోవాలని వేపకుంట, మద్దెలచెరువు గ్రామాల రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం సాయంత్రం రైతులు ఆనందరెడ్డి, నారాయణరెడ్డి, రామలింగారెడ్డి, నారాయణ, గోవిందు,తిప్పయ్య, సోమశేఖర్ విలేకరులతో మాట్లాడారు. పేరూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వేపకుంట, మద్దెలచెరువు గ్రామాల్లోని వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. అయితే గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య వస్తోందన్నారు. దీన్ని పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరడానికి రైతులు సబ్‌స్టేషన్ వద్దకు వెళ్తే ఆపరేటర్ రైతులపై దురుసుగా వ్యవహరించాడన్నారు. రైతులే సబ్‌స్టేషన్‌పై దాడి చేశారని ఐటీడీపీ ద్వారా సోషియల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడన్నారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించకుండా రైతు సమస్యలు కూడా రాజకీయం చేస్తున్న ఆపరేటర్‌ను తొలగించి, చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

స్థల వివాదంలో వ్యక్తికి గాయాలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని జడలయమతం కాలనీ సమీపంలో ఆదివారం స్థల విషయంలో వాగ్వాదం జరిగింది. వివరాలు.. తేజ, రూపేష్ అన్నదమ్ములకు సంబంధించిన స్థలం విషయం మాట్లాడేందుకు నల్లమాడ శంకర్, వారి బంధువులు వచ్చారు. ఈ విషయంపై శంకర్, పార్వతమ్మ మాట్లాడుతూ.. మీ భూమి రోడ్డుకు పోయిందని చెప్పడంతో తేజ, రూపేష్ కలసి శంకర్, పార్వతమ్మపై దాడికి దిగారు. ఈ ఘటనలో శంకర్ రెండు పళ్లు ఊడిపోయాయి. వెంటనే అతడిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

గొర్రెల కాపరిపై దాడి..

మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ముదిగుబ్బ మండలం చెర్లోపల్లికి చెందిన గొర్రెల కాపరి నాగభూషణంపై కుటాగుళ్లకు చెందిన నగేష్ దాడి చేశాడు. మా ఏరియాలో గొర్రెలు మేపుతావా అంటూ నాగభూషణంపై కట్టెతో కొట్టాడు. ఈ దాడిలో అతడికి కాలికి గాయం కావడంతో వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య చికిత్సల అనంతరం నాగభూషణం కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. నగేష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఉచిత కంటి ఆపరేషన్లతో పేదలకు ఊరట

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి ఆపరేషన్లతో నిరుపేదలకు కంటిచూపు అందిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి చూపు తగ్గిన వారికి వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో 160 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 102 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని బెంగళూరుకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నామని రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి సుదర్శన్‌గుప్త, క్యాంపు చైర్మన్ నరేంద్రరెడ్డి, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, రమేష్‌బాబు, శివయ్య, రత్నశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, జయచంద్ర, కొండయ్య, మనోహర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు: మండలంలోని చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే మేకల వెంకటేష్ (38) కోడూరు మన్రో తోపులోని జెడ్పీహెచ్ఎస్‌లో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల మేరకు... మృతుడు వెంకటేష్ ఆరు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడన్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి పాఠశాలలోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్య చికిత్సలకు ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని గరుగుతండా ఉపసర్పంచ్ నారాయణస్వామి నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం అతడ్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సల నిమిత్తం రూ.50 వేల ఆర్థికసాయం చేశారు. అదే విధంగా అదే గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శంకర్ నాయక్ భార్యకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. సిరిగారిపల్లిలో మాజీ ఎంపీటీసీ గంగులయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు బయపరెడ్డి, నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి, గోపాల్ నాయక్, నాగప్ప నాయక్, సిరిగారిపల్లిలో సర్పంచ్ పాపయ్య, నాయకులు మాధవరెడ్డి, రామాంజినేయులు, రామచంద్ర, గంగిరెడ్డి, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వస్తువుల ప్రదర్శనకు తరలివచ్చిన భక్తులు



మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన వస్తువులను చూసేందుకు క్యూలో నిల్చున్న భక్తులు

పెనుకొండ: పట్టణంలోని బాబయ్య దర్గా సమీపంలోని పటాన్ సెంటర్‌లో మహమ్మద్ ప్రవక్త వంశీకులకు చెందిన విలువైన వస్తువులను ప్రదర్శించారు. బాబాయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలు, తలపాగ, ఇతర విలువైన వస్తువులను ప్రదర్శించారు. వేలాది మంది భక్తులు వస్తువులను తిలకించేందుకు తరలివచ్చారు.

పెద్దకోట్ల పెద్దమ్మకు పూజలు



అలంకరణలో పెద్దకోట్ల పెద్దమ్మ తల్లి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో వెలసిన పెద్దకోట్ల పెద్దమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి కాపులు అమ్మవారికి కొత్త కుండలో తీపి అన్నంతో పాటు కల్లును నైవేద్యంగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం జంతుబలులు ఇచ్చి, ప్రసాదాలు అందజేశారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య

రామగిరి: మండలంలోని కానుగులకుంటకు చెందిన సుధాకర్, జయమ్మ దంపతుల కుమారుడు బాబు (14) కడుపునొప్పి తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బాబు రామగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఉదయం తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం బాబు తల్లిదండ్రులు ఇంటికొచ్చి చూసేసరికి దూలానికి వేలాడుతూ కనిపించాడు. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చిన్నపుల్లారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మండలంలోని గరికపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నపుల్లారెడ్డి (72) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి గరికపల్లికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నపుల్లారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు హనుమంతరెడ్డి, రామచంద్రారెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు దివాన్‌వలి, లోకనాథరెడ్డి, టీచర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామగిరి: విద్యార్థులు చదువుతోపాటు ఆటలపోటీల్లోనూ రాణించాలని చిగురు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్ట్ కలెక్టివ్ సహకారంతో చిగురు సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారన్నారు. ఆటలు, చదువుపై ప్రత్యేక దృష్టిసారిస్తే గ్రామానికి , రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, రామన్న, రామాంజనేయులు, చిరంజీవి, రమ్య, రమాదేవి, పోతులయ్య, కల్పన, మంజుళ, గంగమ్మ, హనుమంతు, రామగిరి, చెన్నేకొత్తపల్లి, రొద్దం విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమర్రి, పెద్దకోట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, కునుకుంట్ల, పిన్నదరి, నార్సింపల్లి, ఎం.అగ్రహారం, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామ సచివాలయాలతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో కూడా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందనలో మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486